# రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 313 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 19 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా

## జ్ఞానేశ్ కుమార్

### అర్ధరాత్రి దాటిన తరవాత రాష్ట్రపతి ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేర కు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం ..మిగతా 2లో

సైబర్ నేరాల నియంత్రణకు

# అధిక ప్రాధాన్యం

ఎక్కడో ఒడి చేసే నేరాలే సవాల్‌గా మారాయి

సైబర్ నేరాలను అరికట్టేందుకు 7 కొత్త పోలీసు స్టేషన్లు

సొమ్ము రికవరీలో సైబరాబాద్ పోలీసుల ముందంజ

ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు

షీల్డ్ 2025లో కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): నేరాల శైలీ మారుతోంది, దానికి అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి అన్నారు. సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్‌ఐసిసిలో ఏర్పాటు చేసిన 'షీల్డ్ 2025'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సైబర్ నేరాల్లో కోల్పోయిన సొమ్మని తిరిగి తీసుకురావడంలో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు గత ఏడాది 7 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో ఉండే సొమ్మును దొంగలు దోచుకొనేవారు.. కానీ ఇప్పుడు ఎక్కడి నుంచి దోపిడి చేస్తున్నారో తెలుసు కోవడం కష్టంగా మారిపోయిందన్నారు. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. అయితే నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా ..మిగతా 2లో



వేములవాడ ఉత్సవాలకు

## సిఎంకు ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శివరాతరి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహాశివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, ఆలయ అధికారులు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందించారు. ఉత్సవాలకు రావాలని వేడుకున్నారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు

అన్యాయం

## జరగరాదు

ఏపి ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తోంది

నీటిపారుదలశాఖ మంత్రుల భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

2



ఢిల్లీ సిఎం ఎంపికపై

## నేడు బిజెపి భేటీ

### పర్వేశ్ వర్మవైపూ బిజెపి నేతల మొగ్గు

### రేపటి ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): ఈ నెల 20 ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువు దీరనుందని సమాచారం. సిఎం అభ్యర్థి ఎంపిక సోమవారమే జరగాల్సి ఉన్నా..దానిని 19కి వాయిదా వేశారు. బుధవారం జరిగే భేటీలో సిఎం ఎంపిక జరగవచ్చు. 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంటూ దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఇన్నేళ్ల తర్వాత ..మిగతా 2లో

కాంగ్రెస్ దరిద్రపు పాలనలో ఏ ఒక్క వర్గం కూడా

# సంతోషంగా లేదు

మాజీ మంత్రి కేటీఆర్

### కాంగ్రెస్ పాలనలో మొన్న తలుపులు .. నిన్న స్టార్టర్లు ఎత్తుకుపోయిండు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం)మొన్న తలుపులు ఎత్తుకుపోయిండు.. నిన్న స్టార్టర్లు ఎత్తుకుపోయిండు.. ఇక రేపు మీ పుస్తెలతాడు కూడా రేవంత్ రెడ్డి ఎత్తుకుపోతడు,దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే పని కల్వకుర్తి ప్రాంతం నుంచే మొదలుపెట్టాలని మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం

**కల్వకుర్తి నియోజకవర్గం..**

ఆమన్ గల్ లో మాజీ ఎమ్మెల్యే ..మిగతా 2లో



కుంభమేళాకు

## భారీగా భక్తుల రాక

### 55 కోట్లు దాటినట్లు ప్రభుత్వం ప్రకటన

ప్రయాగరాజ్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా కొనసాగుతోన్న కుంభమేళాకు ఊహించని రీతిలో భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమంలో ఇంత భారీగా జనం పాల్గొనలేదని పేర్కొంది. దేశ విదేశాల నుంచి భారీగా సామాన్యులు, ప్రముఖులు తరలి వచ్చి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక సంబరం ఫిబ్రవరి 26వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. భారత్‌లోని 110 కోట్ల ..మిగతా 2లో



పకడ్బందీగా కొత్త

## రెవెన్యూ చట్టం అమలు

### భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలుకు భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఎంసీహెచ్‌ఆర్డీలో రెవెన్యూశాఖ అధికారులతో సమీక్ష జరిపిన పొంగులేటి.. గత సర్కార్ హయాంలోని రెవెన్యూ చట్టంలో అన్నీ లోపాలు,లొసుగులే ఉన్నాయన్నారు. చట్టం తీసుకొచ్చి మూడేళ్లైనా విధివిధానాలు రూపొందించలేదన్నారు. మేధావులు,నిపుణులతో చర్చించి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం భూ భారతిని తీసుకొచ్చిందని చెప్పారు పొంగులేటి. భూ భారతి చట్టం తరతరాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్నారు. వీలైనంత త్వరగా విధివిధానాల రూపొందించి.. భూ భారతి రెవెన్యూ చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. భూ భారతి చట్టం పెను మార్పులు తీసుకొస్తుందన్నారు.2024 డిసెంబర్ 20 తెలంగాణ భూ భారతి 2024 బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. జనవరి 9న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు.

## భారత్‌లోకి టెస్లా ఆగమన సంకేతాలు

### రిక్రూట్‌మెంట్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): భారత ఈవీ మార్కెట్‌లో ప్రవేశించాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టెస్లా సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో సిబ్బంది నియామకాలను ప్రారంభించింది. ఢిల్లీ, ముంబై నగరాల్లో వివిధ పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్టు లింక్డ్‌ఇన్ వేదికగా ప్రకటించింది. దీంతో టెస్లా రాక ఖాయమైంది. ఇటీవలే ప్రధాని మోడీ, ఎలన్ మస్క్ మధ్య చర్చలు సాగాయి. తరవాత ఈ ప్రకటన వెలువడింది. టెస్లా ప్రకటన ప్రకారం, సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతోంది. మగిలిన పోస్టులకు నియామకాలు ముంబైలో చేపడుతోంది. ప్రధాని మోదీ అమెరికా ..మిగతా 2లో





## కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు

### ఎపి ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తోంది

### నీటిపారుదలశాఖ మంత్రుల భేటీలోమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్రమంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు - రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు కొనసాగుతోన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు సమకూర్చాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీతకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని కోరారు. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ నివేదిక త్వరగా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన కార్యాచరణ సూచించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## కుంభమేళాకు భారీగా భక్తుల రాక

మొదటి పేజీ తరువాయి...

మంది సనాతనుల్లో దాదాపు సగం మంది పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించారని తెలిపింది. ఫిబ్రవరి 26నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తొలుత కుంభమేళాకు 45 కోట్ల మంది మాత్రమే వస్తారని అంచనా వేయగా.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తుతుండటం గమనార్హం. ఫిబ్రవరి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి.. తాజాగా 55 కోట్ల మార్కును చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు రాగా.. మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30న రెండు కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుంభమేళాలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. సంబంధిత ఫొటోను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. మహా కుంభమేళా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మత, ఆధ్యాత్మిక వేడుక అన్నారు. సనాతన సంప్రదాయం, వారసత్వానికి ఇదో గొప్ప ప్రతీకగా పేర్కొన్నారు. దేశం ఆరోగ్యంగా, సౌభాగ్యంగా ఉండాలని గంగామాతను ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే గడ్కరీ దంపతులు కూడా పుణ్యస్నానాలు ఆచరించారు.

## భారత్‌లోకి టెస్లా ఆగమన సంకేతాలు

మొదటి పేజీ తరువాయి...

పర్యటన సందర్భంగా టెస్లా అధినేత మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టెస్లా భారత్‌లో నియామకాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. టెస్లా సంస్థ కొన్నేళ్లుగా భారత విపణిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. 40 వేల డాలర్లకు పైబడిన ఖరీదైన కార్లపై భారత్ ఇప్పటివరకూ 110 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధించింది. ఇటీవల దీన్ని 70 శాతానికి తగ్గించింది.భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ చైనాతో పోలిస్తే చిన్నదే అయినా టెస్లాకు ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారింది. భారత్‌లో గతేడాది లక్ష యూనిట్ల విద్యుత్ కార్లు విక్రయం కాగా చైనాలో ఈ సంఖ్య ఏకంగా 11 మిలియన్లు. అయితే, దశాబ్దం తరువాత తొలిసారిగా టెస్లా కార్ల అమ్మకాలు తగ్గాయి. దీనికి చెక్ పెట్టేందుకు భారత మార్కెట్‌లో ఎంట్రీకి టెస్లా ప్రయత్నిస్తోందని సమాచారం. ఇటీవల డొనాల్ట్ ట్రంప్‌తో సమావేశం అనంతరం ప్రధాని మోదీ అమెరికాతో వాణిజ్యలోటుపై దృష్టి పెట్టేందుకు అంగీకరించారు. రక్షణ రంగ కొనుగోళ్ల పెంపు, ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్ వంటివి తెరపైకి వచ్చాయి. ఇక ట్రంప్ కేబినెట్‌లో కీలకంగా మారిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. అయితే, మస్క్ వ్యక్తిగత హోదాలో మోదీని కలిశారా లేక అమెరికా ప్రభుత్వం తరుపున సమావేశమయ్యారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ట్రంప్ ప్రభుత్వంలో మస్క్‌కు ప్రాధాన్యం పెరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ, ప్రభుత్వ అవసరాల మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఇటలీ ప్రభుత్వ కమ్యూనికేషన్ కోసం స్పేస్ఎక్స్ సేవలు వినియోగించు కునేందుకు చర్చలు జరుగుతున్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. డొనాల్డ్ ట్రంప్‌తో ఇటలీ ప్రధాని సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

## ఢిల్లీ సిఎం ఎంపికపై నేడు బిజెపి భేటీ

మొదటి పేజీ తరువాయి...

అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 20న గురువారం సాయంత్రం 4.30 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. ప్రఖ్యాత రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ వేడుకకు కమలదళం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాణస్వీకారానికి ముందు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇక, 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కేంద్రమంత్రులు, భాజపా అగ్రనేతలు ఈ కార్యక్రమానికి హాజరవుఉతన్నట్లు సమాచారం. వీరితోపాటు దిల్లీకి చెందిన పలువురు రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ ధీరేంద్రశాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు భాజపా వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 8న వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో భాజపా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా తేల్చలేదు. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్‌వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన తాజా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై విజయం సాధించారు. బుధవారం భాజపా శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అందులో కొత్త సీఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నారు. దీంతో లాంఛనం పూర్తి కానుంది. ఆ తరవాత సిఎం గురువారం ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది.

# సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి...

మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలని అన్నారు. దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను సిఎం రేవంత్ అభినందించారు. తెలంగాణను నంబర్ వన్ సైబర్-సేఫ్ స్టేట్‌గా మార్చడానికి కలిసి పనిచేస్తున్న మీ అందరినీ ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుంది. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు... మా ప్రభుత్వం నిపుణులు, ఎఐ సంస్థలతో కలిసి పనిచేయడానికి, అన్ని రకాల వనరులు సమకూరుస్తోంది.మనం తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా.. ఇది 24/7 సైబర్ హెల్ప్‌లైన్ అని అన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని సిఎం అన్నారు. ఈక్రమంలో సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది. కానీ సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరిగిన తరువాత పట్టుకోవడం కాదు.. నేరం జరగకుండా నిరోధించేలా చూడాల్సి ఉందన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ను ప్రచారం చేస్తున్నారు. ఫేక్ న్యూస్ తో పాటు ఆర్థిక నేరాలను కూడా నిరోధించాల్సిన అవసరం ఉంది.సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుదామని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. 'సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్‌వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది' అని మంత్రి అన్నారు.14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్క్లేవ్‌కు హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 'సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్‌గా మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కాన్క్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం' అని వివరించారు. ఈ సమావేశంలో 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఇంత విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లను సీజ్ చేశామని.. అందులో రూ.183 కోట్లు 18 వేల మంది బాధితులకు అందించామని పేర్కొన్నారు.



# కాంగ్రెస్ దరిద్రపు పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు

మొదటి పేజీ తరువాయి...

జైపాల్ యాదవ్ అధ్యక్షతన బీఆర్‌ఎస్ రైతు నిరసన దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు,మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి ,సబిత ఇంద్రారెడ్డి ,రాజయ్య, శ్రీనివాస్ గౌడ్ ,లక్ష్మారెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి , గువ్వల బాల రాజు ,అంజయ్య యాదవ్ ,మర్రి జనార్ధన్ రెడ్డి , ఎమ్మెల్సీ నవీన్ ,సురభి వాణి, ఆర్ ఎస్ ప్రవీణ్ , మాజీ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చెర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే పని కల్వకుర్తి ప్రాంతం నుంచే మొదలుపెట్టాలి.

కల్వకుర్తి నియోజకవర్గం, ఆమనగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రైతు మహాధర్నా కార్యక్రమంలో పాల్గొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగించారు.420 దొంగ హామీలు ఇచ్చి నంగనాచి మాటలు చెప్పి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు.కొడంగల్ లో రేవంత్ రెడ్డి ఎవరికి న్యాయం చేయలేదని ఎద్దే వ చేశారు. అక్కడ ఎవరికి రైతుబంధు రాలేదు. రుణమాఫీ కాలేదు. కళ్యాణ లక్ష్మి తులం బంగారం ఇవ్వలేదు. ఆడబిడ్డలకు 2,500 రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు.సొంత నియోజకవర్గంలో ఒక్క పని చేయలేదు. పుట్టి పెరిగిన పిల్లనిచ్చిన కల్వకుర్తి ప్రాంతానికి కూడా ఒక్క రూపాయి పని చేయలేదన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక రాజు లాగా రైతు ఎవరి దగ్గర చేయి చాపకుండా బ్రహ్మాండంగా బతికిండన్నారు.పదేళ్లు మోటార్లు కాలలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలలేదు. పదేళ్లు రైతులు ఎవరి దగ్గర అప్పులు అడిగే పరిస్థితి లేకుండే. నాట్లేసే టైం కి టింగు టింగు మని రైతుబంధు పైసలు పడుతుండే అన్నారు.టకీ టకీ మని రైతు భరోసా ఇస్తనని రేవంత్ రెడ్డి గప్పాల్ కొట్టిండు. కానీ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.కేసీఆర్ కంటే ఎక్కువగా రైతు భరోసా రూ. 15,000 ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పిండు కానీ 10 శాతం మంది రైతులకు కూడా ఇవ్వలేదన్నారు.సోనియా జన్మదినం సందర్భంగా రుణమాఫీ ఒకేసారి రెండు లక్షలు చేస్తానని చెప్పిండు. కానీ ఇప్పటివరకు చారాణా రుణమాఫీ కూడా చేయలేదు. 500 బోనస్ 10% మంది కూడా పడలేదు.ఆడబిడ్డలకు అరచేతిలో స్వర్గం చూపించిండు.పిల్లనిచ్చిన అత్తగారి ప్రాంతంలోనీ ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి ప్రతినెలా 2500 రూపాయలు ఇస్తున్నాడేమో అనుకున్నా. అయితే అత్తగారి ప్రాంతాన్ని కూడా మోసం చేసిండు.ఈ 14 - 15 నెలలు 35 సార్లు ఢిల్లీకి చెక్కర్లు కొట్టడంతోనే రేవంత్ రెడ్డికి సరిపోయింది. కానీ ఢిల్లీ నుంచి 35 పైసలు కూడా తేలేదు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రివర్స్ మైగ్రేషన్ తో వేరే రాష్ట్రాల కూలీలు పాలమూరుకు వచ్చి పనిచేసేవారు.మొన్న తలుపులు ఎత్తుకుపోయిండు. నిన్న స్టార్టర్లు ఎత్తుకుపోయిండు. ఇక రేపు మీ పుస్తెలతాడు కూడా రేవంత్ రెడ్డి ఎత్తుకుపోతడు.రేవంత్ రెడ్డి దొంగ అని ఎలక్షన్ల ముందు చెప్పినం. తెలంగాణ మొత్తం ఇప్పుడు రేవంత్ రెడ్డి మోసాన్ని తెలుసుకుందన్నారు. రైతుకు కులం లేదు మతం లేదు. 70 లక్షల మంది రైతులను కేసీఆర్ గారు పదేళ్లు కడుపులో పెట్టుకొని చూసుకున్నారు. 73 వేల కోట్ల రూపాయల రైతుబంధు పైసలు రైతుల ఖాతాల్లో వేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి ఈ భారత దేశంలో కేసీఆర్ ఒక్కరే.స్వతంత్ర భారతదేశ చరిత్రలో రైతు చనిపోతే అతని కుటుంబానికి 5 లక్షల భీమా ఇచ్చిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.మేనమామ లెక్క ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేరుతో లక్ష రూపాయలు ఇచ్చిండు. 200 రూపాయల పెన్షన్ ను పదిరెట్లు పెంచి 2000 రూపాయలు కేసీఆర్ చేసిండని మాజీ మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి నిజాయితీగల మోసగాడన్నారు.రేవంత్ రెడ్డిది సిగ్గు ,లజ్జ లేని బతుకు కాబట్టే తెలంగాణ ప్రజలు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నా కూడా పట్టించుకోకుండా ఉంటున్నడన్నారు.42% రిజర్వేషన్ల పేరుతో బీసీలను రేవంత్ రెడ్డి మోసం చేసిండు. రైతు భరోసా 15,000 ఇస్తానని అన్నదాతలను మోసం చేసిండు.12,000 ఇస్తానని రైతు కూలీలను మోసం చేసిండు.నెలకు 2,500 ఇస్తానని ఆడబిడ్డలను మోసం చేసిండన్నారు. చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తానన్నాడు. లగ్గం చేసుకుంటే తులం బంగారం ఇస్తా అనీ వాళ్లను మోసం చేసిండన్నారు. ఇలా తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి విజయవంతంగా మోసం చేస్తూనే ఉన్నాడు. కాంగ్రెస్ 420 పాలనలో 430 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గురుకుల పాఠశాలలను నడపడం చేతకాని సన్నాసి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికి 56 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం విషాదకరమన్నారు.కాంగ్రెస్ దరిద్రపు పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు.ఎన్నికలకు ముందు కెసిఆర్ రైతుబంధు కోసం ఉంచిన పైసల్నే రేవంత్ రెడ్డి వేసిండు అంతేకానీ ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క రూపాయి కూడా రైతు భరోసా కింద ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒక్కో ఎకరానికి 17500 రేవంత్ రెడ్డి బాకీ ఉన్నాడని కేటీఆర్ ఆరోపించారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకొని తెలంగాణ ప్రజలు నిలదీయాలన్నారు.ఎన్నికల తర్వాత దాదాపు 1000 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు సంపాదించిండ్రు. ఆ భూముల రేట్లు పెంచుకోవడానికి ఇప్పుడు కొత్తగా పెద్ద రోడ్లు వేయాలని ప్లాన్ చేస్తున్నాడన్నారు.రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ గురించి తప్ప స్టేట్ గురించి ఫికర్ లేదన్నారు.600 కోట్ల రూపాయలు ఇస్తే సర్పంచుల పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారం అవుతుందన్నారు.దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే పని కల్వకుర్తి ప్రాంతం నుంచే మొదలుపెట్టాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

## ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలి

### కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్ సునీత

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం)ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశమని జిల్లా ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్ సునీత తెలిపారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో సమావేశ మందిరంలో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వీ రజనీతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... మార్చి 8వ తేదీన జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను, వివాదాలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కోర్టులకు వెచ్చించే సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా, కోర్ట్ ఫీజు కూడా వాపస్ పొందవచ్చు అని చెప్పారు. ఏదైనా కేసు ఒకసారి లోక్ అదాలత్ పరిష్కారం అయ్యింది అంటే అది శాశ్వతంగా పరిష్కారమైనట్లేనని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమవుతున్న కేసుల విషయంలో, రాష్ట్రంలో వనపర్తి జిల్లా స్థానం రాను రాను మెరుగుపడుతోందన్నారు. గత డిసెంబర్ 14వ తేదీన నిర్వహించిన లోక్ అదాలత్ లో వనపర్తి జిల్లా కోర్టు అత్యధిక కేసులను పరిష్కారం చేసి రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచిందని చెప్పారు. మార్చి 8వ తేదీన జరగబోయే లోక్ అదాలత్ లో మరిన్ని కేసుల పరిష్కారం ద్వారా వనపర్తి జిల్లా కోర్టు మరింత మెరుగైన స్థానాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్ సునీత

## కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికీ నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మొగ్గుచూపింది. 2029 జనవరి 26 వరకూ ఆయన సిఇసిగా కొనసాగనున్నారు. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. జ్ఞానేష్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. అంతకుముందు ఆయన హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని సహకార, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖల కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌తోసహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు.

## కెసిఆర్ ఫ్లెక్సీలు తీస్తే తీయండి... నా ఫ్లెక్సీలు మాత్రం తియ్యకండి

**ఫ్లెక్సీలను తొలగిస్తున్న అధికారులను అసభ్య పదజాలంతో దూషించడం ఎమ్మెల్యేకు ఎంతవరకు సమంజసం**

**కాంగ్రెస్ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం యుగంధర్ రెడ్డి**



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫ్లెక్సీలను తీస్తే తీయండి కానీ ఈనెల 19న తన జన్మదినం సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను మాత్రం తియ్యొద్దని దయచేసి ప్రాధేయపడుతున్నానని చెప్పకనే చెప్తున్నాడని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ ఎద్దేవా చేశాడు. ఫ్లెక్సీల తొలగింపు విషయంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న అధికారులను ఒక ఎమ్మెల్యేగా ఉండి నోటికి వచ్చినట్లు తిట్టడం ఎంతవరకు సమంజసమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు వాళ్ళ విధులు నిర్వహించనీయకుండా ఎమ్మెల్యే బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఫ్లెక్సీల తొలగింపుకు సంబంధం లేదు. ఫ్లెక్సీల కు సంబంధించిన చట్టం గురించి బిఆర్ఎస్ ప్రభుత్వమే గత పదేళ్లలో ఒక్కటి కూడా ఉండకుండా తొలగించిందని చెబుతున్న ఎమ్మెల్యే, మరి ఇప్పుడు ఫ్లెక్సీల తొలగింపుకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ పార్టీని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని తీవ్రంగా విమర్శించారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓపిక కోల్పోతున్నాడని అన్నారు.

# భారత రాజ్యాంగాన్ని ప్రజాప్రతినిధులు, పౌరులు చదవాలి

**విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు దాసరి శ్యామ్ మనోహర్**

**డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అంటే ఉద్యోగుల సంక్షేమం: ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ మేడి రమేష్**



డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దాసరి శ్యామ్ మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సెక్రటరీ జనరల్ మేడి రమేష్



ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి రత్నాకర్ రావు



4) కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు



శివరాం పల్లి లోని విద్యుత్ డి ఈ కార్యాలయంలో నెలకొల్పిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సంఘం అధ్యక్షులు దాసరి శ్యామ్ మనోహర్, సెక్రటరీ జనరల్ మేడి రమేష్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం) భారత రాజ్యాంగ అంశాలపై సమాజంలోని ప్రతి ఒక్కరూ చదివి అవగాహన పెంపొందించుకోవాలని విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి శ్యామ్ మనోహర్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి లో గల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డివిజన్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రీజనల్ సెక్రటరీ మంద యాదయ్య, డివిజన్ అధ్యక్షులు కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్యామ్ మనోహర్ , ప్రధాన కార్యదర్శి మేడి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి శ్యామ్ మనోహర్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగాన్ని సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు చదవాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను ప్రతి ఒక్కరు పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మేడి రమేష్ మాట్లాడుతూ... డాక్టర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ స్ఫూర్తితో సమాజంలో ఉన్న అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవటం ఉద్యోగుల సంక్షేమానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, అడిషనల్ సెక్రటరీ సోమ్లు, కంపెనీ ప్రెసిడెంట్ ఆనంద్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సెక్రటరీ సెకరెటరీ బీచ్ పల్లి, రీజినల్ ప్రెసిడెంట్ జైపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, , వెంకటేష్, అర్జున్ , డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్, సెక్రెటరీ మహేష్, ట్రెజరర్ సంపత్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీ పుట్టపాగ పరశురాం, రాకేష్, కుమార్, రాములు, రాజు, శ్రీనివాసులు, నరసింహ, శ్రీధర్, వినోద్, సుధీర్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

## రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధికి సహకరించాలి

బుద్వేల్, ఫిబ్రవరి18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లోని వివిధ బస్తీల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతు మంగళవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను ఆయన ఇంటి వద్ద కలసి వినతి పత్రం అందజేశారు. దానికి స్పందించిన గడ్డం ప్రసాద్ కుమార్ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులు త్వరితగతిన చేయాలని సూచించారు. దానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పలుగుచెరువు మహేశ్, రగడంపల్లి శ్రావణ్, పి.జీవన్ దాస్, మంగళారం శ్రీనివాస్ లు తెలిపారు.

# సజీవంగా వందల ఏళ్ల వయసున్న వ్యక్తులు

**దోజ్ డోర్ తెరిచి ఆశ్చర్యం వ్యక్తంచేసిన మస్క్**

**సమాచార సేకరణలో లోపం వల్లే ఇలాంటి తప్పులు**

న్యూయార్క్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): అమెరికాలో వందల ఏళ్ల వయసున్న వ్యక్తులు ఇప్పటికీ సజీవంగా ఉన్నారన్న వార్తలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. వారిలో 200 ఏళ్ల వయసు దాటినవారు రెండు వేల మందికిపైగా ఉన్నారన్న సమాచారం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక 360-369 ఏళ్ల వయసున్న వ్యక్తి ఒకరున్నారు. ఈ విషయాన్ని అక్కడి సోషల్ సెక్యూరిటీ డేటా విభాగం చెబుతోంది. ఈవిషయాన్ని డోజ్ అంటే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ బృందం ధ్రువీకరించింది. తాజాగా దాని అధిపతి ఎలాన్ మస్క్ దీనిని ఎక్స్‌లో వెల్లడించారు. వందేళ్లు దాటిన దాదాపు 2 కోట్ల మంది ఇప్పటికీ సోషల్ సెక్యూరిటీ లబ్ధికి అర్హుల జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి సోషల్ సెక్యూరిటీ అర్హుల జాబితా సంఖ్య అమెరికాలో ప్రస్తుత పౌరుల సంఖ్య కంటే అధికంగా ఉందని వెల్లడించారు. చరిత్రలోనే ఇది అతిపెద్ద మోసమని పేర్కొన్నారు. వాస్తవానికి 2023లో సోషల్ సెక్యూరిటీ ఆడిట్‌లో దాదాపు 18.9 మిలియన్ల మంది



వందేళ్లు దాటిన వారున్నట్లు గుర్తించారు. వారు ఆదాయం పొందడం లేదా.. లబ్ధిలను స్వీకరించడం కానీ, చేయడం లేదు. అయినా ఆ జాబితాను సవరించలేదు. 112 ఏళ్ల వయసున్నవారు 65 లక్షల మంది సోషల్ సెక్యూరిటీ నెంబర్లను కలిగిఉన్నారు. కాని, వారికి సంబంధించి ఎటువంటి డెత్ ఇన్ఫర్మేషన్ నమోదు చేయలేదు. వీరంతా ఎలక్ట్రానిక్ డెత్ ఇన్ఫర్మేషన్ నమోదు వ్యవస్థ రాకముందే ప్రాణాలు కోల్పోయారు. వాస్తవానికి భూమ్మీద కేవలం 35 మంది మాత్రమే ఈ వయస్సును దాటినవారున్నారు. ఇక జనాభా లెక్కల ప్రకారం అమెరికాలో 100 ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య కేవలం 86,000 మాత్రమే. ఇక అమెరికాలోని సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రజలకు చెందిన రిటైర్మెంట్, వైకల్యంతో బాధపడేవారికి సంబంధించిన ఆదాయమార్గాలను సమకూరుస్తుంది. అమెరికాలో ట్రెజరీ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లించిన 4.7 ట్రిలియన్ డాలర్ల (రూ.4 కోట్ల కోట్లు)కు, టాస్ (ట్రెజరీ అకౌంట్ సింబల్) లేదని డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. దీంతో ఆ నిధులు ఎటు వెళ్లాయో గుర్తించడం దాదాపు అసాధ్యమని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ కోడ్ వాడటం ఇప్పటివరకు ఆప్షనల్ అని వెల్లడించారు. కానీ, తాజాగా డోజ్ ఈ విషయాన్ని గుర్తించడంతో టాస్ కోడ్ వాడటం తప్పనిసరి చేసినట్లు మస్క్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇటీవలే ట్రంప్ కార్యవర్గం మస్క్ నేతృత్వంలోని డోజ్‌కు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ సమాచారం చూసేందుకు యాక్సెస్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా డోజ్ అమెరికా రెవెన్యూ డిపార్ట్‌మెంట్లో పన్ను చెల్లింపుదారుల డేటాలో కూడా తమకు యాక్సెస్ ఇవ్వాలని కోరింది. ఇది లభిస్తే మాత్రం అమెరికాలో పన్ను చెల్లింపుదారులు, బ్యాంకులు, ఇతర సున్నితమైన డేటా మొత్తం డోజ్ చేతికి వస్తుంది.



## నేడు హిమాయత్ సాగర్, కిస్మత్‌పూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం) కిస్మత్పూర్, హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో బుధవారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అయా సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్లు మల్లేష్ రాజ్, అమర్ సింగ్ లు తెలిపారు. కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని డాన్ వేసుకో విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్నేహిత హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన మీ చల్ కాలనీ, వినాయక నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ నగర్, సంధ్యా నగర్, జి ఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్, మధ్యాహ్నం 1:30 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన ఆరే మైసమ్మ ప్రధాన రహదారి, కాలిక నగర్, ఎన్ఎఫ్సీ కాలనీ, మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ రోడ్ నెంబర్ 1, 5, న్యూ కేర్ హాస్పిటల్, గాయత్రి నగర్, వికాస్ నగర్, ద్వారకా నగర్, యాదవ మిత్ర కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంతి కాలనీ కమ్యూనిటీ హాల్, భారతి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

**హిమాయత్ సాగర్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి సాయంత్రం 4 న గంటల వరకు వివిధ మర్మాత్తుల నిమిత్తం పీరంచెరువు గ్రామం, వసతి ఆనంది అపార్ట్మెంట్, గిరి దారి అపార్ట్మెంట్స్, ఎంపైర్ డెల్టా విల్లాస్, షాదన్ కాలేజ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రాసెసింగ్ పై అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, ఉత్తర్ ప్రదేశ్ రైతులకు నాలుగు రోజుల పాటు శిక్షణ



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ తారా సత్యవతి



డాక్టర్ తారా సత్యవతి

బుద్వేల్, ఫిబ్రవరి18(ప్రభాత ఉదయం): చిరుదాన్యాలను పండించే నార్త్ ఈస్టరన్ హిల్ ప్రాం తాలకు చెందిన రైతులు వాటిని ప్రాసెసింగ్ చేసి మార్కెట్ లోకి తీసుకువెళితే అధిక లాభాలు ఉం టాయని రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఐఐఎంఆర్ లో ఇంపాల్ కు చెందిన సెం ట్రల్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ సహకారంతో నార్త్ ఇస్టరన్ హిల్ రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ తో పాటు ఉత్తర్ ప్రదేశ్ చిరుదాన్యాల రైతులకు నాలుగు రోజుల పాటు రాజేం ద్రనగర్ లో శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ, చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యాన్నివ్వడమే కాకుండ అనేక అనారోగ్య సమస్యలనుంచి ప్రజలను కాపాడతాయన్నారు. పండిచిన చిరుధాన్యాలకు విలువ జోడింపు చేసి మార్కెట్ లోకి తీసుకువెళితే వాటికి మంచి మార్కెట్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న రైతులకు ఉచితంగా చిరుదాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. కోర్స్ కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ సంగప్ప. ఐఐఎంఆర్ లోని న్యూట్రీ హబ్ లో చేపడుతున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ విధానాలను రైతులకు చూపించారు. చిరుధాన్యాల నుంచి ఎన్ని రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చో వారికి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె.శ్రీనివాస్ బాబు ఓడిస్సా మిల్లెట్ మిషన్ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి.మహేశ్ బి తెగ్గీ, డాక్టర్ మహేశ్ కుమార్, డాక్టర్ రఫీ, మేఘన, చంద్రలేఖ లు పాల్గొన్నారు.



## ఘనంగా నందమూరి తారకరత్న ద్వితీయ వర్ధంతి

**ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన సతీమణి నందమూరి అలేఖ్య**

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం) సినీహీరో స్వర్గీయ నందమూరి తారకరత్న ద్వితీయ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి బాలయ్య యువసేన ఆధ్వర్యంలో జేఎన్టీయూ సర్కిల్ ఎన్ టి ఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన సతీమణి నందమూరి అలేఖ్య విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆటో కార్మికులకు, జేఎన్టీయూ సెక్యూరిటీ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం సర్దార్ పటేల్ నగర్ గ్రేస్ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అట్లూరి దీపక్, పవన్ మార్ని, కోటి ఆతోట, చెరుకూరి రవి, మదన్మోహన్, కోగంటి ప్రసాద్, రాజేష్ సౌడోజు, కాకర్ల గోపికృష్ణ, చావా వినయ్, బత్తుల మణిదీప్, సాయి కుమార్, కర్నాటి కొండలరావు, విక్రమ్ సింహ, అఖిల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జోక్యం చేసుకోవాలి







పెన్షనర్ల నుద్దేశించి మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగి ఎన్ జంగయ్య













నిరసనలో పాల్గొన్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు

బుద్వేల్, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ కు బడ్జెట్ లో నిధులు కేటాయించే విధంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగి ఎన్. జంగయ్య, విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు షేక్ రియాజ్, సత్తమ్మ తదితరులు మాట్లాడుతూ, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోకి వచ్చే ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ సంస్థ ఉద్యోగుల బాగోగులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పట్టించుకోవాలన్నారు. సమస్యను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. పీ ఎం ఓ లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిని ఎన్ఐ ఆర్ డీ పి ఆర్ కు డైరెక్టర్ జనరల్ గా నియమించి గతంలో జరిగిన తప్పులన్నిటిని సరిదిద్ది సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.



# విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

## మాజీ సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవ రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం) కొత్తకోట ప్రీమియర్ లీగ్ -1 ఐదవ రోజు మొదటి మ్యాచ్ ను టాస్ వేసి మాజీ సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవ రెడ్డి ప్రారంభించారు. టాస్ అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ఆటలో గెలుపోటములు సహజం ,గెలపుకోసం ప్రతి జట్టు కృషి చేయాలి అని ,ఆటలతో పాటు విద్య మీద కూడా దృష్టి కేంద్రీకరించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు పసుపుల నెహ్రూ, కేపీఎల్ నిర్వాహకులు పి.నవీన్ రెడ్డి,బాలకృష్ణ రెడ్డి,తరుణ్,శివశంకర్,అంజి,రఘు,గణేష్,రవి తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరగాళ్లకు బలైన బాధితులకు రిఫండ్ పత్రాలను అందజేస్తున్న పోలీసులు

# సైబర్ క్రైమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న 6గురు బాధితులకు 30,130 రూపాయాల రిఫండ్ ఆర్డర్ కాపీ లు అందజేత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం) సైబర్ క్రైమ్ కు గురై 33030 రూపాయల డబ్బులు పోగొట్టుకున్న (గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో -1, గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో - 5 గురు) బాధితులకు జిల్లా ఎస్పి టి శ్రీనివాస రావు ఐపీఎస్ ఆదేశాల మేరకు గద్వాల్ టౌన్ ఎస్సై కళ్యాణ్ కుమార్ రిఫండ్ ఆర్డర్ కాపీలను అందజేసారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930 కు లేదా సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చెయ్యడం ద్వారా ఆయా పోలీస్ స్టేషన్ లలో ఉన్నా సైబర్ వారియర్స్, జిల్లా సైబర్ క్రైమ్ బ్యూరో వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాదితుల డబ్బును సంబంధిత బ్యాంక్ అకౌంట్ లలో అమౌంట్ ను ఫ్రీజ్ చేసి మంగళవారం గద్వాల జిల్లా డి ఎల్ ఎస్ ఏ కోర్టు జడ్జి గంట కవిత ద్వారా 30,130 రూపాయల రిఫండ్ ఆర్డర్స్ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ... ఎవరైనా సైబర్ నేరాల గురైతే వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 1930 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ లో 24 గంటల లోపు పిర్యాదు చేస్తే పోగొట్టుకున్న అమౌంట్ తిరిగి పొందేందుకు కృషి చెయ్యడం జరుగుతుందని అన్నారు.




# కేంద్ర బడ్జెట్‌ను సవరించేదాకా పోరాడాతాం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం) కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వెంటనే సవరించాలని, బడ్జెట్ ను సవరించేంతవరకు వామపక్ష పార్టీలుగా ప్రజల పక్షాన పోరాడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి ,సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఆశన్న అన్నారు . మంగళవారం వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ లోని వైయస్సార్ చౌరస్తా వద్ద సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారులపై విధించే పన్నును 22 శాతం నుంచి 15 శాతానికి తగ్గించారని,పేదలు మధ్య తరగతి ప్రజలు ఉపయోగించే వస్తువులపై విపరీతమైన పన్నులు విధిస్తున్నారని విమర్శించారు సంపద సృష్టికర్తలైన ప్రజలు రైతులు కార్మికులను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు కేంద్రం ఊడిగం చేస్తున్నదని విమర్శించారు పేద ప్రజల ద్వారా ఆదాయాన్ని పొంది వారి కోసం ఖర్చు చేయకుండా బడా కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారీలకు రాయితీలు ఇస్తూ దేశాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు దేశ ఆర్థిక అభివృద్ధి ముందుకు వెళ్లాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలని కొనుగోలు శక్తి పెరగాలంటే ప్రజలకు ఉపాధి కల్పించాలని ఆ దిశగా బడ్జెట్ లో ఎటువంటి ప్రాతిపాదనలు లేవని విమర్శించారు ప్రజలకు ఉపాధి కల్పించకుండా దేశ ఆర్థిక అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలలో ధనికులపై వారసత్వ పన్నును విధిస్తున్నారని మన దేశంలో ఎందుకు విధించడం లేదని ప్రశ్నించారు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఉపాధిని పెంచే ఉపాధి హామీ పథకానికి మాత్రం నిధులలో కోతలు విధిస్తున్నారని విమర్శించారు కార్పొరేట్ అనుకూల ఈ బడ్జెట్ ను సవరించి విద్యా వైద్యం గ్రామీణ ఉపాధి హామీ తదితర సంక్షేమ రంగాలకు నిధుల కేటాయింపు పెంచేంతవరకు వామపక్ష పార్టీలుగా ప్రజలకు అండగా నిలిచి పోరాడుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీపీఐ నాయకులు వివి నరసింహ ఎల్కూర్ రంగన్న వెంకట్రామిరెడ్డి చిన్న మస్తాన్ పవన్ భీముడు రామాంజనేయులు నరేష్ మహేష్ రంగన్న నరసింహ తదితరులు పాల్గొన్నారు.



నూతన తహసిల్దార్ హరికృష్ణ ను సన్మానించిన కార్యాలయ సిబ్బంది

# కేటిదొడ్డి తహసీల్దార్‌గా హరికృష్ణ

## తహసిల్దార్ గా బాధ్యతల స్వీకరణ చేసిన హరికృష్ణ


గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి18(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండలం తహసీల్దార్ గా హరికృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా కేటిదొడ్డి తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న షాహిదాబేగం మల్దకల్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ కాగ, ఆమె స్థానంలో ఉండవెల్లి తహసీల్దార్ హరికృష్ణ బదిలీపై కేటిదొడ్డికి వచ్చారు. అనంతరం నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ, కార్యాలయ సిబ్బంది, మీసేవా కేంద్రాల నిర్వహకులు స్వాగతం పలికి,శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ ను శాలువాతో సన్మానించారు.

# రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్ డీపీఆర్‌కు బడ్జెట్ కేటాయించాలి






ఎన్ఐఆర్ డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆ సంస్థ గేటు ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న ఫెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు




పోస్టు కార్డు ద్వారా రాష్ట్రపతికి ఎన్ఐఆర్ డీపీఆర్‌ను కాపాడాలని లేఖలు రాసిన ఫెన్షనర్లు




నిరసనలో పాల్గొన్న ఫెన్షనర్ల పిల్లలు

### ప్రధాన మంత్రి చొరవ తీసుకుని పీ ఎం ఓ లో ఉన్న ఐఏఎస్ అధికారిని నియమించాలి

### ఉద్యోగులకు, ఫెన్షనర్లకు న్యాయం చేయాలి

బుద్వేల్, ఫిబ్రవరి 18 (ప్రభాత ఉదయం): సేవ్ ఎన్ఐర్డీపీ ఆర్ అంటు ఆ సంస్థకు చెందిన ఫెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలతో మంగళవారం రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్డీపీఆర్) ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పెన్షనర్లందరు ఏప్రిల్ నుంచి తమ జీతాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 67 సంవత్సరాల క్రితం 1958లో మూసోరీ లో సెం ట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ పేరుతో ప్రారంభమైన ఈ సంస్థ ఆ తర్వాత డేహ్రాడూన్ రాజ్ పూర్ జిల్లా పంచాయతీ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టడంతో ప్రసిద్ధికెక్కిందన్నారు. 1962లో రాజేంద్రనగర్ లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (ఎన్ఐసీడీ) గా ఏర్పాటు అయ్యిందన్నారు. 1964-65లో పబ్లిక్ సర్వీసెస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేయబడిన ఈ సంస్థ 1977లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ గా మారిందన్నారు. అదే సంస్థను 2014లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ పంచాయతీరాజ్ గా మార్చారన్నారు. గ్రామీణాభివృద్ధి రీసెర్చ్, ట్రైనింగ్, కన్సల్టెన్సీలో ప్రపంచవ్యాప్తంగా వేలాది మందికి శిక్షణ ఇచ్చిన ఎన్ఐర్డీపీఆర్ కు 2025-26 కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడం భాదాకరమన్నారు. సంవత్సరానికి ఐదు వేల శిక్షణ కార్యక్రమాల ద్వారా దాదాపు 15వేల మంది దేశ విదేశాలకు చెం దిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ రంగ నిపుణులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే సం స్థకు అకస్మాత్తుగా నిధులను నిలిపి వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలోని 6, 064 గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ఐఆర్డీపీఆర్ లో నిత్యం ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి కార్యాలయంలో ఉన్న సమర్థుడైన ఐఏఎస్ అధికారిని నియమించి, సంస్థకు రూ.100 కోట్లు కేటాయించి గాడిలో పెట్టాలని కోరారు.

### సేవ్ ఎన్ఐఆర్డీపీఆర్ , రీమూవ్ డీజీ డాక్టర్ నరేంద్ర కుమార్: పీఎస్ మణి, ఎన్ఐఆర్డీ పీఆర్ ఫెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు :

222 మంది ఉద్యోగులు, 380 మంది పెన్షనర్లు, 474 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్న సంస్థకు డైరెక్టర్ జనరల్ గా ఉన్న డాక్టర్ నరేంద్రకుమార్ సంస్థకు 2025-26 బడ్జెట్ లో నిల్ బడ్జెట్ కేటాయిస్తున్న ఎందుకు ప్రశ్నించలేకపోయారు. ఆ విషయాలన్నిం టిని ఎందుకు గోప్యగా ఉంచారు. అందుకే ఎన్ఐఆర్ డీ పీఆర్ ను రక్షించాలని, డీజీగా ఉన్న డాక్టర్ నరేంద్రకుమార్ ను ఇక్కడి నుంచి పంపించి సమర్థుడైన డీజీని పీఎంఓ నుంచి వేయాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంస్థ కు రూ.100 కోట్లు కేటాయించాలి.



### బాధ వేస్తుంది : పాతిమా జోసెఫ్, విశ్రాంత ఉద్యోగినీ




ప్రపంచంలోనే పేరున్న ఎన్ఐఆర్ డీపీఆర్‌కు ఈ సంవత్సరం బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదంటే చాలా బాధగా ఉంది. తమ పరిస్థితి ఏంకావాలి. సంస్థ కోసం ఎంతో కష్టపడ్డాం. ప్రధానమంత్రి నరేంద్రమోడీ కల్పించుకుని తమ సంస్థను కాపాడాలి.

### నిధులు కేటాయించకపోతే మా పరిస్థితేంటి : పద్మ, ఫెన్షనర్




దేశంలోనే ఎంతో పేరున్న ఎన్ఐ ఆర్డీపీఆర్ కు నిధులు కేటాయించకపోతే మా పరిస్థితి ఏంటి. తాము తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలి. తమకు న్యాయం చేయాలి.

### ప్రధాన మంత్రులు. రాష్టపతులు వచ్చిన సంస్థ ఇది సెలస్టియన్, విశ్రాంత గెస్ట్ హౌజ్ మేనేజర్:




1985 నుంచి 2002 వరకు తాను ఎన్ఐఆర్డీపీఆర్ లో గెస్ట్ హౌజ్ మేనేజరుగా పనిచేశాను. 1987లో ప్రధానిగా ఉన్న రాజీవ్‌గాంధీ ఈ సంస్థకు వచ్చి ఒకటిన్నర రోజు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 104 మంది కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. దేశాధ్యక్షులుగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఈ సంస్థకు వచ్చి మెచ్చుకున్నారు. అలాంటి సంస్థను మూసివేయడానికి ప్రయత్నించవద్దు.

### బాగుంటుందని డిల్లీ నుంచి ఇక్కడికి వచ్చాం : సవిత, ఎన్ఐఆర్డీపీఆర్ లో ఓ ఉద్యోగి భార్య



తాము ఢిల్లీలో గల కపాట్ లో పనిచేస్తు అది మూత పడ్డాక రాజేంద్రనగర్ లోని ఎన్ఐఆర్డీపీఆర్ కు వచ్చాం. ఇప్పుడు నిదులు ఇవ్వకపోతే మా పరిస్థితి ఏంటి తమకు న్యాయం. చేయాలి.

### ఒక కన్నును తీసేస్తారా : కె.శ్రీదేవి, ఉద్యోగి తల్లి :



గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధిలు దేశానికి రెండు కళ్లలాంటివి. గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయి ంచకుండ ఒక కన్నును తీసివేస్తామంటే ఎలా. దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ పునరాలోచిం చాలి. సమర్థుడైన అధికారిని నియమించి ఏవైన పొరపాట్లు జరిగితే సరిచేయాలి. ఎంతో పేరున్న సంస్థకు నిధులు కేటాయించకపోతే ఎలా.

### ఎన్ఐఆర్డీ పీఆర్ కు నిధులు కేటాయించాలని రాష్టపతికి పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి

ఎన్ఐఆర్ డీ పీఆర్ కు నిధులు కేటాయించాలని కోరుతు పెన్షనర్లు అందరు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు పోస్టు కార్డు ద్వారా ఉత్తరాలు రాస్తున్నారు. గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ ఉద్యోగులు, ఫెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాపాడాలని కోరుతున్నారు.

# మక్తల్‌లో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన మక్తల్ సీఐ చంద్రశేఖర్

## ఓ కేసులో 20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సిఐ చంద్రశేఖర్

మక్తల్, ఫిబ్రవరి 18(ప్రభాత ఉదయం) ఓ కేసులో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ప్రత్యక్షంగా దొరికిపోయాడు మక్తల్ సీఐ చంద్రశేఖర్. ఓ కేసులో తమకు సానుకూలంగా పోలీసులు చార్జి సీట్లు దాఖలు చేయాలని కోరడంతో పోలీస్ అధికారి లంచం డిమాండ్ చేశారు. దీంతో నిందితుల నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబి అధికారులకు పట్టుబడ్డారు. రూ.20 వేల కోసం కక్కుర్తిపడి ఉద్యోగానికే ఎసరు తెచ్చుకున్నారు. ఈ సంఘటన నారాయణ పేట జిల్లాలో మంగళవారం కలకలం రేపింది. ఏసిబి డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్‌కు చెందిన సంధ్యా వెంకట రాములు నారాయణపేట జిల్లా మక్తల్‌లో శ్రీనిధి ఫైనాన్స్ సొసైటీని ఏర్పాటు చేశాడు. ఈయనపై పలు కేసులతోపాటు ఇటీవల కిడ్నాప్ కేసు నమోదు అయింది. ఈ కేసులో హైకోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌లో భాగంగా మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌తో కలిసి హాజరుకావాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టుకు వెళ్లి వస్తున్న క్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సాన్నిహిత్యాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న సంధ్యా వెంకట రాములు.. తనకు అనుకూలంగా చార్జి సీట్లు దాఖలు చేయాలని కోరాడు. దీంతో పోలీస్ స్టేషన్ రైటర్ నరసింహ సంధ్య వెంకటరమణతో మాట్లాడి రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో సీఐ చంద్రశేఖర్ ఆదేశాలతో పోలీస్ స్టేషన్‌లోనే కానిస్టేబుల్ నరసింహ, శివ నిందితుడి నుంచి రూ.20వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెయిడ్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకున్నారు. సీఐ కోసమే లంచం తీసుకున్నామని రైటర్ ఏసీబీ అధికారులకు వాంగ్మూలం ఇవ్వడంతో చంద్రశేఖర్‌పైనా అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. బాధితుడి నుంచి తీసుకున్న రూ.20 వేల లంచం డబ్బులను రికవరీ చేసినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.




ఏసీబీకి చిక్కిన మక్తల్ సిఐ , కానిస్టేబుళ్లు

# ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా అధికారులు పనిచేయాలి



శిక్షణ పొందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సంతోష్

### జిల్లా కలెక్టర్ సంతోష్ శిక్షణ అనుభవాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి18(ప్రభాత ఉదయం) ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పొందిన శిక్షణ అనుభవాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంసిఆర్ హెచ్ ఆర్ డి ఇనిస్టిట్యూట్ 139వ స్థాయి-డి శిక్షణా కార్యక్రమంలో భాగంగా, కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ ఆఫీసర్ల 16 మంది బృందంతో శిక్షణా కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాల క్రియాశీల అమలుతోనే ప్రజలకు నిజమైన లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి పథకం లక్ష్యం, ఆచరణ విధానం, క్షేత్రస్థాయిలో దాని ప్రభావాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడమే ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, సమర్థతను పెంచుతుందని అన్నారు. శిక్షణలో భాగంగా అధికారులు మల్దకల్ మండలంలోని శేషంపల్లి గ్రామం, గద్వాల మండలంలోని కొత్తపల్లి గ్రామం, ధరూర్ మండలంలోని జాంపల్లి గ్రామం, కేటీ దొడ్డి మండలంలోని మైలగడ్డ గ్రామం, గద్వాల మున్సిపాలిటీ వంటి ప్రాంతాలను సందర్శించి పథకాల అమలు తీరును పరిశీలించారని, ఆయా పథకాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాల ఆధారంగా అర్థం చేసుకున్నారని వివరించారు.వ్యవసాయం, డి.ఆర్.డి.ఓ,మిషన్ భగీరథ, జెన్కో, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, స్వచ్ఛ భారత్,చేయూత పింఛన్లు తదితర ప్రభుత్వ పథకాలపై విశ్లేషణ చేపట్టారని తెలిపారు. కలెక్టర్ అధికారులను తమ అనుభవాలను పంచుకోవాలని తెలిపారు. అధికారులు పథకాల అమలు తీరును దగ్గరగా పరిశీలించడం, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవి ఎలా ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం చేసుకోవడం చాలా విలువైన అనుభవమైందని అన్నారు. ఈ పర్యటన భవిష్యత్తులో కొత్త విధానాలను అమలు చేయడంలో ఉపయోగపడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయని వారు అభిప్రాయపడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ ఆఫీసర్లు, తదితరలు పాల్గొన్నారు.



కొలువు దీరిన జమ్ములమ్మ అమ్మవారు

# నడిగడ్డ ప్రజల ఆరాధ్య దైవం జములమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి18(ప్రభాత ఉదయం)జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. రెండు వారాలుగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. జములమ్మ తల్లీ.. కరుణించవమ్మా అంటూ భక్తుల నామస్మరణ, మహిళల పూనకాలతో క్షేత్రం మారుమోగింది. భక్తులు ఆలయ గదులతో పాటు, పరిసరాల్లో షామియానాలను వేసుకొని నైవే ద్యాన్ని సిద్ధం చేసుకున్నారు. నైవేద్యంతో పాటు చీర, సారె అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉందని, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు.



అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608